





సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 12-4-2025

సంపుటి: 21 సంచిక: 16

పేజీలు: 8 వెల: రూ.1




• ఎడిటోరియల్

# గవర్నర్ వ్యవస్థకు మరో చెంపదెబ్బ

సుప్రీంకోర్టు మొన్నిచ్చిన తీర్పు ప్రజాస్వామ్యానికి ఊపిరి పోసింది. రాజ్యాంగ పదవుల్లో నియమితులైనవారు ఆ రాజ్యాంగానికి లోబడి పని చేయాలేగానీ దాన్ని అతిక్రమించరాదని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని హెచ్చరించింది. ఈ మేరకు జస్టిస్ జె.బి.పార్థీవాలా, జస్టిస్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం గవర్నర్లు రాజ్యాంగాన్ని అడ్డుపెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వాలను ఇరుకున పెడుతున్న అనేక అంశాల పట్ల స్పష్టంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. తమిళనాడు అసెంబ్లీ తీర్మానం చేసి పంపిన పది బిల్లులను ఆమోదించకుండా గవర్నర్ అట్టి పెట్టుకోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. ప్రజలెన్నుకున్న ప్రభుత్వాల సలహా ప్రకారమే గవర్నర్లు పని చేయాలని, రాష్ట్రాలను వీటో చేసే అధికారం రాజ్యాంగం వారికి ఇవ్వలేదని తేల్చిచెప్పింది. ఇంతకాలం గవర్నర్లను అడ్డం పెట్టుకుని బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలను ముప్పుతిప్పలు పెడుతున్న మోదీ పరివారానికి ఈ తీర్పు చెంపపెట్టులాంటిది. అలాగే సంఘ్ భావజాలాన్ని నింపుకుని పనిచేస్తున్న గవర్నర్లకు కూడా ఇది మింగుపడనిది. కానీ సమాఖ్య స్ఫూర్తికి పెద్దపీట వేసేలా ఉన్న ఈ తీర్పు పట్ల దేశమంతా హర్షం వ్యక్తం చేస్తోంది. 'ఇది ఒక్క తమిళనాడుకే కాదు.. అన్ని రాష్ట్రాల భారీ విజయం' అని డీఎంకే అధినేత, ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈ తీర్పును 'సమాఖ్య నిర్మాణం, శాసనసభ బలమైన హక్కుల ధ్రువీకరణ'గా అభివర్ణించారు. బీజేపీ కనుసన్నల్లో పనిచేస్తూ మోదీకి అనుయాయుడిగా పేరు తెచ్చుకున్న తమిళనాడు గవర్నర్ రవిది మొదటి నుంచి వివాదాస్పద శైలి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఏ నిర్ణయాన్నీ కూడా గౌరవించరు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను గవర్నర్ ఉపన్యాసంతో మొదలుపెట్టే ప్రక్రియ విషయంలోనూ ఆయన సాకులు చూపుతూ రెండుమూడుసార్లు వాకౌట్ చేశారు. ప్రజాసంక్షేమం, అవసరాలకు సంబంధించి తమిళనాడు ప్రభుత్వం పది బిల్లులను అసెంబ్లీలో ఆమోదింపజేసుకుని.. తుది ఆమోదానికి గవర్నర్‌కు పంపితే ఆయన వాటిని తనవద్దే తొక్కిపెట్టారు. సుదీర్ఘ కాలయాపన తర్వాత ఆమోదించకుండానే వెనక్కి పంపారు. వాటిని రెండోసారి అసెంబ్లీలో ఆమోదించి పంపితే రాష్ట్రపతి పరిశీలనకు పంపి చేతులు దులుపుకున్నారు. దాంతో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గవర్నర్ అధికారాల పరిధి ఎంతన్నది సుప్రీంకోర్టు తన తాజా తీర్పులో స్పష్టం చేసింది. బిల్లుల విషయంలో గవర్నర్ వ్యవహరించిన తీరు ఏకపక్షంగా ఉందని, ఇది చట్టవిరుద్ధమని వ్యాఖ్యానించింది. ఒకసారి అసెంబ్లీ పంపిన బిల్లులను ఆమోదించడానికి నిర్దిష్ట కాలపరిమితి ఏమీలేదని పేర్కొంది. ఇప్పటివరకు అడ్డుకున్న బిల్లులన్నీ గవర్నర్‌కు రెండోసారి పంపిన తేదీ నుంచి ఆమోదం పొందినట్టేనని చెప్పింది. రాష్ట్రపతి తదుపరి చర్యలను కూడా పక్కన పెట్టింది. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వాలకు ఇలా అడ్డుతగలడం గవర్నర్ల పని కాదని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. ఈ తీర్పు గవర్నర్ల హద్దులను గుర్తుచేసింది. గవర్నర్ అంటే కేంద్ర ప్రభుత్వ రబ్బర్‌స్టాంప్ కాదని, ఆ పదవి రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర వ్యవస్థ అని గతంలో 'ఎస్ఆర్ బొమ్మై వర్సెస్ భారత ప్రభుత్వం' కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. తమిళనాడు ఒక్కటే కాదు, కేరళలోనూ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను గత గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ తొక్కిపెట్టిన తీరు అప్పట్లో వివాదాస్పదమైంది. ఈ తీర్పుతో అక్కడి బిల్లులకు కూడా మార్గం సుగమమైనట్టే! అయితే, తెలంగాణలోనూ గత గవర్నర్ తమిళిసైతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి చేదు అనుభవమే ఎదురైంది. బెంగాల్ ప్రభుత్వం కూడా ఇదే సమస్య ఎదుర్కొంటోంది. 2023లో అప్పటి ప్రధాన న్యాయమూర్తి డీవైచంద్రచూడ్ 'గవర్నర్లు ప్రభుత్వాలకు అడ్డంకులుగా కాకుండా స్నేహితులు, మార్గదర్శకులు'గా పనిచేయాలని ఒక కేసు విచారణ సందర్భంగా పంజాబ్ గవర్నర్‌ను హెచ్చరించారు. అయినా గవర్నర్లు కేంద్ర ప్రభుత్వానికి రాజకీయ ప్రతినిధులుగానే వ్యవహరిస్తూ విమర్శలు మూటకట్టుకుంటున్నారు. గవర్నర్ల తీరుతో సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింటోందని కేరళ ముఖ్యమంత్రి విజయన్ ఢిల్లీలో ఆందోళన కూడా చేశారు. ఇలాంటి ఘటనలను చూస్తే బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాల్లో ఎలాగైనా సరే గవర్నర్లతో తమ పరిపాలన సాగించాలని చూస్తున్నట్టుంది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్య బలోపేతానికి మరింత ఊతమిచ్చింది. 'రాజ్యాంగం ఎంత మంచిదైనా, దాన్ని అమలు చేసేవారు సరిగ్గా లేకుంటే అది చెడుగా కనిపిస్తుంది' అన్న అంబేద్కర్ వ్యాఖ్యలను ఉటంకించి మరీ సుప్రీంకోర్టు పాలకులకు గట్టి చురకలే అంటించింది. ఈ తీర్పుతోనైనా అధికారంలో ఉన్నవారు బుద్ధి తెచ్చుకోవాలి. పాలనాతీరు మార్చుకోవాలి. లేదంటే ప్రజలే వారిని మారుస్తారు!

# అలరించిన రామాయణ కథాగానం

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

మండలంలోని కొత్తవలస గ్రామం కోదండ రామాలయం వద్ద శ్రీరామనవమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈనెల 6 నుంచి ఈ ఉత్సవాలు ఆలయం వద్ద ప్రారంభమయ్యాయి. 39సంవత్సరాలుగా ఆలయం వద్ద శ్రీరామనవమి ఉత్సవాలను కమిటీ సభ్యులు, గ్రామస్తులు, పరిసర గ్రామాల సహాయ సహకారులతో కమిటీ వారు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద తొమ్మిది రోజులు పాటు సంపూర్ణ రామాయణ కథనాన్ని ఏర్పాటు చేశారు. తిరుపతికి చెందిన హరికథా కళాప్రపూర్ణ సి.షణ్ముఖి భాగవతారిణి సంపూర్ణ రామాయణం (వాల్మీకి రామాయణ) కథాగానాన్ని ఆలపించారు. ప్రతిరోజు సాయంత్రం 7 నుండి రాత్రి 10:30గంటల వరకు కథాగానాన్ని ఆలపిస్తున్నారు. షణ్ముఖి ఆలపిస్తున్న కథాగానం గ్రామస్తులను ఆకట్టుకుంటుంది. పిన్నవయసులోనే ముచ్చటగా కథాగానాన్ని ఆలపించడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కథాగానం ఈనెల 14వరకు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. వయోలిన్ సహకారం దూసి రమేష్ మాస్టారు అందిస్తుండగా, తబలా వాయిద్య సహకారం తిరుపతికి చెందిన టి సుబ్రమణ్యం అందిస్తున్నారు. శ్రీరామనవమి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఈనెల 15న ఆలయం వద్ద పెద్దఎత్తున అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.



# బీచ్ పరిసరాలు పరిశీలన

(సత్యంన్యూస్, గార)

మండలంలోని బందరువానిపేటలో శుక్రవారం పల్లెనిద్ర చేసిన ఎమ్మెల్యే గొండు శంకర్ శనివారం ఉదయం బీచ్ పరిసరాలను పరిశీలించారు. రాత్రి గ్రామంలోగల ప్రాథమిక పాఠశాలలో బస చేసిన ఆయన ఉదయం అక్కడే కాల కృత్యాలు తీర్చుకున్నారు. అనంతరం టీడీపీ నాయకులు, గ్రామస్తులతో కలిసి బీచ్ పరిసరాలను పరిశీలించి, తీరాని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాన్ని అన్ని విధాలుగా అందరి సహకారంతో అభివృద్ధి చేస్తానని హామీ నిచ్చారు. ప్రతి ఒక్కరూ ఐక్యతగా ఉంటూ ప్రభుత్వానికి సహకరించాలని అభివృద్ధి పనులకు అండగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

# మొబైల్ డయాలసిస్ వాహనాలు ఏర్పాటు చేయాలి




(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)

ఉద్దానం ప్రాంతంలో మారుమూల గ్రామాలలోని కిడ్నీ రోగులకు డయాలసిస్ సేవలు అందించేందుకు మొబైల్ డయాలసిస్ వాహనాలు ఏర్పాటు చేయగలిగితే రోగులకు గొప్ప మేలు జరుగుతుందని వైకాపా నాయకులు సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం నెఫ్రో ప్లస్ వారు ఇటువంటి సేవలు కొన్ని ప్రాంతాలలో అందిస్తున్నారని, ఇటువంటి సదుపాయం ఉద్దానం ప్రాంతంలో భవిష్యత్తులో ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతవాసులకు మేలు చేకూరుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. మొబైల్ డయాలసిస్ వాన్ అనేది డయాలసిస్ చికిత్సను అందించడానికి రూపొందించబడిన ఒక వాహనమని, ఇది రోగులకు వారి ఇళ్లలో లేదా ఆసుపత్రికి వెళ్లకుండానే డయాలసిస్ చికిత్సను అందించడానికి ఉపయోగిస్తారన్నారు. ఈ వాహనం పనితీరు ఎలా ఉంటుందన్న దానిపై ఆయన వివరించారు. మొబైల్ డయాలసిస్ వాన్‌లో డయాలసిస్ మెషీన్, డయలైజర్, ఇతర అవసరమైన పరికరాలు ఉంటాయన్నారు. డయాలసిస్ చేయవలసిన రోగిని వాన్ లోకి తీసుకువెళ్తారని, డయాలసిస్ మెషీన్ ద్వారా రోగి రక్తం నుండి వ్యర్థాలను తొలగించి, శుభ్రం చేస్తారని తెలిపారు. శుభ్రం చేసిన రక్తాన్ని తిరిగి రోగి శరీరంలోకి ఎక్కిస్తారన్నారు. ఈ మొబైల్‌వ్యాన్స్ ద్వారా డయాలసిస్ రోగులకు సత్వర చికిత్స అందించే వీలు కలుగుతుందన్నారు. దీంతోపాటు దూర ప్రాంతాల్లో గల ఆసుపత్రులకు వెళ్లే ఇబ్బందులు కూడా తగ్గుతాయన్నారు.

# ఆక్రమణలను తొలగించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం చేపట్టిన ఓపెన్ ఫోరం కార్యక్రమంలో డీటీసీపీ అప్రూవ్డ్ నర్సెస్ కాలనీలో 80 అడుగుల రహదారి ఆక్రమణ నిలుపుదల చేయాలని, అక్రమంగా ఇటీవల నిర్మాణం చేసిన ప్రహరీ గోడను తొలగించాలని పరిసర ప్రాంతాల నివాసులు కోరారు. శ్రీకాకుళం నగరం, డీసీసీబీ కాలనీ ఎక్స్‌టెన్షన్, శ్రీ భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయం, నర్సెస్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కాలనీ లే-అవుట్ పరిసర ప్రాంతాల నివాసులు అసిస్టెంట్ టౌన్ ప్లానింగ్ అధికారి వెంకటేశ్వరరావుకి వినతి పత్రం సమర్పించారు. సదరు స్థలం డీసీసీబీ కాలనీ ఎక్స్‌టెన్షన్, నర్సెస్ కాలనీలో 80 అడుగుల రహదారిగా డీటీసీపీలో నిర్ధారించారన్నారు. వీటిని కొందరు వ్యక్తులు తప్పుడు పత్రాలు పుట్టించి డీటీసీపీ ఎల్పీ నెంబర్ 155/88 ద్వారా అప్రోవ్ కాబడిన 80 అడుగులరోడ్డులో పడమట భాగంలో 40 అడుగుల రోడ్డును తప్పుడు పత్రాలతో ఆమోదం పొంది, ఆక్రమణ చేసి కాంపౌండ్‌వాల్ నిర్మాణం చేపట్టారన్నారు. దీనివలన మూడు ఇళ్లకి చెందిన ముఖద్వారాలు గేట్లు మూసివేయబడిందన్నారు. అంతేకాకుండా సగం రహదారి ఆక్రమణ చేయడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడిందన్నారు. దీంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. గతంలో దీనిపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశామన్నారు. మీటిని గమనించి సదరు స్థలమునకు కాంపౌండ్ వాల్ నిర్మాణం అనుమతిని రద్దు చేసి, ఇంతవరకూ జరిగిన ప్రహరీ గోడ నిర్మాణాన్ని తొలగించి సమగ్ర విచారణ చేసి 80 అడుగుల రోడ్డును పునరుద్ధరించాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో బిర్లంగి రామ్మోహన్, కొత్తకోట మధుసూదనరావు, గొప్పు సంతోష్, ఏ.యు.ఎస్.ప్రసాద్ తదితరులున్నారు.



'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

# ఎలివేషన్లే తప్ప ఎమోషన్ లేదు!

**తమిళంలో టాప్ స్టార్లలో ఒకడైన అజిత్ కుమార్ కొన్నేళ్ల నుంచి సరైన విజయాలు లేక ఇబ్బంది పడుతున్నాడు. ఇప్పుడు ఆయన్నుంచి వచ్చిన కొత్త చిత్రం.. గుడ్ బ్యాడ్ అగ్లీ. 'మార్క్ ఆంటోనీ' దర్శకుడు. అజిత్ ఫ్యాన్ బాయ్ అయిన ఆధిక్ రవిచంద్రన్ రూపొందించిన ఈ చిత్రాన్ని తెలుగు అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ప్రొడ్యూస్ చేయడం విశేషం. తమిళ-తెలుగు భాషల్లో ఒకేసారి విడుదలైన ఈ చిత్ర విశేషాలేంటో చూద్దాం పదండి.**

**కథ:**

**ఏకే పూర్వాశ్రమంలో పెద్ద ఇంటర్నేషనల్ డాన్. ఐతే కుటుంబం కోసం మాఫియా కార్యకలాపాలన్నీ పక్కన పెట్టి సాధారణ జీవితం గడపాలని నిర్ణయించుకున్న అతను.. తన నేరాలు ఒప్పుకుని జైలుకు వెళ్తాడు. జైలు నుంచి విడుదలై కుటుంబంతో సంతోషంగా గడపాలి అనుకున్న సమయంలోనే తన కొడుకు కిడ్నాప్ అవుతాడు. తర్వాత అతను డ్రగ్స్ వినియోగంతో పాటు హత్యా నేరం కేసులో అరెస్ట్ అవుతాడు. తన కొడుకును కుట్రపూరితంగా ఇందులో ఇరికించారని తెలియడంతో ఏకేలోని పాత మనిషి బయటికి వస్తాడు. ఈ కుట్ర చేసింది ఎవరో తనదైన శైలిలో విచారించడం మొదలుపెడతాడు. దీనికంతటికీ జానీ (అర్జున్) దాస్ కారణమని తెలుస్తుంది. ఇంతకీ ఏకే కొడుకుని జానీ ఎందుకు టార్గెట్ చేశాడు.. తన గతమేంటి.. అతడికి ఏకే కుటుంబానికి సంబంధమేంటి.. ఏకే అతడికి ఎలా బుద్ధి చెప్పాడు అన్నది మిగతా కథ.**

**నటీనటులు:**

కొన్నేళ్లుగా అభిమానులను మెప్పించే సినిమా చేయలేకపోతున్న అజిత్.. ఈసారి వారిని మెప్పించడమే లక్ష్యంగా.. తనకు వీరాభిమాని అయిన దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్ ఏం చెబితే అది చేసినట్లున్నాడు. తన లుక్ గత చిత్రాలతో పోలిస్తే చాలా బాగుంది. యంగ్ లుక్ సహా వేరియేషన్లు బాగానే చూపించాడు. ఎలివేషన్ సీన్లలో అజిత్ స్క్రీన్ ప్రెజెన్స్ బాగుంది. అభిమానులనే కాక మాస్ ను మెప్పించేలా అతను కనిపించాడు. త్రిష పాత్ర.. తన నటన సోసోగా అనిపిస్తాయి. తన మీద వయసు ప్రభావం పడుతున్న సంగతి ఈ చిత్రంలో స్పష్టంగా కనిపించింది. పోలీసాఫీసర్ పాత్రలో త్రిష కన్విన్సింగ్ గా అనిపించలేదు. విలన్ పాత్రలో అర్జున్ దాస్ అదరగొట్టాడు. అజిత్ కొడుకు పాత్రలో 'సలార్' ఫేమ్ కార్తికేయ దేవ్ ఓకే అనిపించాడు. జాకీష్రాఫ్ ఊరికే అరవడం తప్ప చేసిందేమీ లేదు. సునీల్ కొంచెం ముఖ్య పాత్రే చేశాడు కానీ.. దాని ఇంపాక్ట్ తక్కువే. ప్రియ ప్రకాష్ వారియర్ తన గ్లామర్ తో ఆకట్టుకుంది. ప్రసన్న.. రెడిన్ కింగ్స్ లీ సహాయ పాత్రల్లో పర్వాలేదు.

**కథనం-విశ్లేషణ:**

హీరో పేరు విన్నా.. అతడి ఫొటో చూసినా.. వామ్మో ఇతనా అంటూ కనిపించే ప్రతి క్యారెక్టర్ భయంతో వణికిపోవడం.. తన గురించి ఎలివేషన్లు ఇవ్వడం.. బ్యాగ్రౌండ్ స్కోర్ మోత మోగిపోవడం.. కెమెరా షేకైపోవడం.. 'కేజీఎఫ్' సినిమా పుణ్యమా అని బాగా ఊపందుకున్న ట్రెండ్ ఇది. ఐతే ఊరికే మిగతా పాత్రలతో ఇలా హైప్ ఇచ్చి ఊరుకుంటే సరిపోదు.. ఆ పాత్ర నేపథ్యం చూశాక ఆ బిల్డప్ కరెక్టే అనిపించాలి. అది జరిగినప్పుడే ఎలివేషన్లు వర్కవుట్ అవుతాయి. కానీ గత కొన్నేళ్లలో వచ్చిన చాలా సినిమాల్లో హీరో పాత్రల్ని.. వాటికిచ్చే బిల్డప్‌ను చూస్తే 'కేజీఎఫ్'ను చూసి వాత పెట్టుకున్నట్లే అనిపిస్తుంది తప్ప ఎలివేషన్ పెద్దగా పండిన దాఖలాలు కనిపించవు. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' కూడా ఈ కోవకే చెందుతుంది. సినిమాలో ఓ గంట పాటు గురంచి పెద్ద తోపు.. తురుం ఖాన్ అంటూ చుట్టూ ఉండే క్యారెక్టర్లు బిల్డప్పులివ్వడానికే సరిపోతుంది. తీరా అతనేం చేశాడో చూద్దాం అని ఒక లుక్కేస్తే.. ఏఐ సాయంతో కీను రీవ్స్ లాంటి ఇంటర్నేషనల్ స్టార్ల పక్కన అజిత్ ను నిలబెట్టేసి.. యానిమేషన్ రూపంలో అతడి విన్యాసాల్ని చూపించి సరిపెట్టేశాడు దర్శకుడు. దీనికి తోడు పదే పదే అజిత్ స్లోమోషన్లో నడిపించడం.. తన పాత సినిమాల్లోని రెఫరెన్సులు పెట్టడం.. సినిమా అంతా ఇదే వరస. ఇలాంటివి చూసి తమిళనాట అజిత్ ఫ్యాన్స్ ఊగిపోతారేమో కానీ.. మన ప్రేక్షకులకైతే ఇది ఎంత మాత్రం కిక్కు ఇవ్వదు. తెలుగు ప్రేక్షకుల కోణంలో చూస్తే మాత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఒక తలపోటు వ్యవహారంలాగే అనిపిస్తుంది. హీరో పూర్వాశ్రమంలో పెద్ద డాన్.. వర్తమానంలో సామాన్య జీవితం గడుపుతుంటాడు. తన కుటుంబ సభ్యుల్లో ఒకరికి సమస్య తలెత్తితే అతడి పాత అవతారం బయటికి వస్తుంది.. 'బాషా'తో మొదలుపెడితే గత మూడు దశాబ్దాల్లో ఈ లైన్లో ఎన్ని వందల సినిమాలు వచ్చాయో లెక్కే లేదు. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' కూడా అదే కోవలోని చిత్రమే. ఐతే గత కొన్నేళ్లలో అజిత్ మాస్ ఇమేజ్ పక్కన పెట్టి కొన్ని ప్రయోగాత్మక చిత్రాలు చేసి దెబ్బ తిన్న నేపథ్యంలో.. ఈసారి కథ.. కొత్తదనం.. కాకరకాయ అని ఎక్కువ ఆలోచించకుండా కేవలం ఫ్యాన్స్ కు మాస్ ట్రీట్ ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లున్నాడు దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్. హీరో ఇంట్రో దగ్గర్నుంచి దగ్గ ర్నుంచి ఒకటే బిల్డప్ సీన్లతో సినిమాను నింపేశాడు. వీటికి తోడు అజిత్ పాత చిత్రాల రెఫరెన్సులు సినిమాలో బోలెడు కనిపిస్తాయి. అజిత్-త్రిష జంటగా నటించిన 'మన్కాతా' సినిమాలో హీరో.. హీరోయిన్ తండ్రిని కార్లోంచి తోసేస్తాడు. దాన్ని గుర్తు చేస్తూ త్రిష డైలాగ్ చెప్పడం మొదలు.. సిమ్రన్ ను తీసుకొచ్చి 'వాలి' సినిమా మ్యూజిక్ బిట్స్ వేయడం వరకు అజిత్ సినిమాల రెఫరెన్సులకైతే లెక్కే లేదు. ఓవైపు విపరీతమైన ఎలివేషన్లు.. ఇంకోవైపు ఇలాంటి రెఫరెన్సులతో అజిత్‌ను ఫ్యాన్స్ ఎలా చూడాలనుకుంటున్నారో అలా చూపించి వారికి గూస్ బంప్స్ ఇవ్వడం బాగానే ఉంది కానీ.. కథ పరంగా మాత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఏమంత ఎగ్జైట్మెంట్ కలిగించదు. ఓవరాల్‌గా అంత మంచి ఫీలింగ్ ఇవ్వకపోయినా.. కొన్ని ఎపిసోడ్ల వరకు 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఓకే చేస్తుంది. ముఖ్యంగా విలన్ డెన్లోకి హీరో ఎంట్రీ ఇచ్చి అక్కడ విధ్వంసం సృష్టించే ఎపిసోడ్ ప్రథమార్ధానికి హైలైట్‌గా నిలుస్తుంది. ద్వితీయార్ధంలో కూడా యాక్షన్ సీక్వెన్సులన్నీ బాగానే తీశారు. కానీ సినిమాను ముందుకు తీసుకెళ్లే బేసిక్ ఎమోషన్ అయితే ఇందులో ఏమీ లేదు. హీరో ఇంటర్నేషనల్ మాఫియా డాన్‌గా ఎదిగే క్రమం కానీ.. ఫ్యామిలీకి సంబంధించిన ఎమోషనల్ యాంగిల్ కానీ.. బలంగా లేవు. అంతా పైపై వ్యవహారంలా అనిపిస్తుంది. ఎలివేషన్లు శ్రుతి మంచడం.. ప్రతి సన్నివేశంలో విపరీతమైన హడావుడి కనిపించడం వల్ల ఒక దశ దాటాక 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చికాకు పెడుతుంది. చివరి అరగంటలో అయితే ఈ హడావుడి మరీ ఎక్కువైపోయి ముగింపు సమయానికి తలపోటు తప్పదు. ఎమోషన్ సంగతి పట్టించుకోకుండా కేవలం ఎలివేషన్లు చూసి ఊగిపోవాలనుకుంటే 'గుడ్ బ్యాడ్ అగ్లీ'పై ఓ లుక్కేయొచ్చు. అంతకుమించి ఆశిస్తే మాత్రం తీవ్ర నిరాశ తప్పదు.

**సాంకేతిక వర్గం:**

**జి.వి.ప్రకాష్ కుమార్ సినిమాకు తగ్గట్లే మాస్ మసాలా మ్యూజిక్ ఇచ్చాడు. నేపథ్య సంగీతం మంచి ఊపుతో సాగుతుంది. ఎలివేషన్.. యాక్షన్ సీన్లలో స్కోర్ ఆకట్టుకుంటుంది. కానీ పాటలు మాత్రం గుర్తుంచుకునేలా లేవు. అభినందన్ రామానుజం ఛాయాగ్రహణం బాగుంది. నిర్మాణ విలువలకు ఢోకా లేదు. మైత్రీ వాళ్లు ఏమాత్రం రాజీ పడకుండా ఖర్చు పెట్టారు. భారీ ఫారిన్ లొకేషన్లలో రిచ్ గా సినిమా తీశారు. రచయిత-దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్ నుంచి 'మార్క్ ఆంటోనీ' తర్వాత ఆశించే మ్యాజిక్ ఇందులో లేదు. అతను అజిత్ ను అభిమానులు మెచ్చేలా చూపించడం మీదే దృష్టిపెట్టాడు. అజిత్ పాత చిత్రాల రెఫరెన్సుల మీద పెట్టిన శ్రద్ధ.. కొంచెం కథాకథనాల మీద కూడా పెడితే బాగుండేది.**

- తుపాకి.కామ్ సౌజన్యంతో...



## మా భూములు లాక్కోవద్దు!!

(సత్యంన్యూస్, రాజాం)

ఏండ్ల తరబడి సాగు చేసుకుంటున్న తమ భూములను లాక్కోవద్దంటూ పలువురు రైతులు ఆందోళనకు దిగారు. భూమి చదును చేసేందుకు వెళ్లిన ఆఫీసర్లను, జెసిబిలను అడ్డుకొని నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... విజయనగరం జిల్లా రాజాం మున్సిపాలిటీ పరిధిలో గల రంగప్ప చెరువును ఆధునికరణ చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు ఆ భూములను చదును చేసేందుకు రెవెన్యూ, మున్సిపాలిటీ ఆఫీసర్లు వెళ్లారు. 1970 నుంచి భూమి శిస్తు సైతం చెల్లిస్తున్నామని, ఇప్పుడు ఆఫీసర్లు వచ్చి భూములు తీసుకుంటామంటే ఎలా అని ప్రశ్నించారు. ఏది ఏమైనా తమ భూములు వదులుకునేందుకు సిద్ధంగా లేమని స్పష్టం చేశారు. తమ భూములను లాక్కోవద్దని ఇప్పటికే ఆఫీసర్లకు వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం భూములు తీసుకుంటే సుమారు 70 కుటుంబాలు రోడ్డున పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనతో ఆఫీసర్లు పనులు చేయకుండానే వెనుదిరిగారు.



## మహిళ మెడలో బంగారం అపహరణ

(సత్యంన్యూస్, రాజాం)

మహిళ మెడలో మూడు తులాల బంగారు పుస్తెలతాడు అపహరణ చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా, రాజాం మండలం, పోగిరి గ్రామ సమీపంలో కళ్లంలో పని చేసుకుంటున్న జడ్డు చిన్నముదు అనే మహిళపై బైక్ పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి మహిళ కళ్ళల్లో కారం కొట్టి మెడలో ఉన్న మూడు తులాల పుస్తెలతాడు లాక్కొని పోయాడు. దీంతో మహిళ మెడకు కోసుకొని గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న రాజాం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ కుమార్ తెలిపారు.

## బందరువానిపేటను బాగు చేసే బాధ్యత నాది

(సత్యంన్యూస్, గార)



మండలంలోని బందరువానిపేటను అన్ని విధాలుగా బాగుచేసి అభివృద్ధి చేసే బాధ్యత నాది అని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ హామీనిచ్చారు. మండలంలోని బందరువానిపేటలో శుక్రవారం పల్లెనిద్ర చేసిన ఎమ్మెల్యే గొండు శంకర్ శనివారం ఉదయం సముద్ర తీర ప్రాంతంలో పర్యటించారు. అనంతరం గ్రామంలో గ్రామ ప్రజలతో రచ్చబండ వద్ద మాట్లాడుతూ గ్రామంలో శ్మశానవాటిక, లైటింగ్ హౌస్, సముద్రతీర ప్రాంతం, కాంపౌండ్‌వాల్, శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకు పరిశీలించానని చెప్పారు. గ్రామంలో సమస్యలను తెలుసుకునేందుకు పల్లెనిద్ర చేసినట్లు వివరించారు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు అన్న ఎన్‌టీ రామారావు ఈ ప్రాంతానికి వచ్చి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారన్నారు. ఆనాటి తరువాత ఇక్కడ సౌకర్యాలు ఏవీ ఇక్కడ కల్పించలేదని, ఎన్‌టీఆర్ స్ఫూర్తితో సముద్రంలోకి వెళ్లి చేపలను ఒడ్డుకు మోసుకొని వచ్చేందుకు, మార్కెట్‌కు తరలించేందుకు మీరు ఎంత ఇబ్బంది పడుతున్నారో ప్రత్యక్షంగా చూశానన్నారు. సముద్రంలో కొంత దూరం వరకు సీసీ రోడ్డ నిర్మాణం చేపడతామని వివరించారు. రోడ్డు కొట్టుకుపోకుండా రాళ్లతో నిర్మాణాలు చేపడతామని చెప్పారు. దీంతో చేపలను ఎక్కువ దూరం మోసే పరిస్థితిని బయట పడవచ్చన్నారు. గ్రామంలో ఎక్కువ మంది మంచినీటి కుళాయిలకు మోటార్లు బిగించిన పరిస్థితిని పరిశీలించానని స్పష్టం చేశారు. రెండు రోజుల్లో సర్వే చేసి వారికి నోటీసులు ఇవ్వడం జరుగుతుందని, వెంటనే మోటార్లు తొలగించకుంటే కఠినచర్యలు తీసుకుంటామని వివరించారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటికి కుళాయి కనెక్షన్లు అందజేస్తామన్నారు. గ్రామంలో చాలావరకు ఇళ్లల్లో ప్రజలు అనేక దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని త్వరలో గ్రామంలో అన్ని సదుపాయాలతో కూడిన కాలనీని నిర్మించేందుకు తన వంతు కృషి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.

## సీఓడబ్ల్యుఈ రాష్ట్ర అధ్యక్షురాలిగా గీతాశ్రీకాంత్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మహిళా సాధికారతే లక్ష్యంగా ఏర్పడిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్ ప్రెన్యూర్స్ ఇండియా (సీఓడబ్ల్యుఈ(కోవె)) రాష్ట్ర అధ్యక్షురాలిగా గీతా శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఈమేరకు విజయవాడలోని ఒక ప్రైవేటు హోటల్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె రాష్ట్ర అధ్యక్షురాలి హోదాలో కొత్త కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. జాతీయ కార్యదర్శి, సహాయ కార్యదర్శులు అపర్ణ, రాధికల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జౌళి, చేనేత శాఖ కమిషనర్ రేఖారాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళా సాధికారత, వ్యాపార అభివృద్ధికి, ఈ సంస్థ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ప్రత్యేకంగా ఏపీ చాప్టర్ దూరదృష్టి గల నాయకత్వాన్ని ప్రశంసిస్తూ ఇది మహిళ నమ్మకాన్ని సాధించే సంస్థ అని కొనియాడారు. కోవె సంస్థ మహిళా వ్యాపారవేత్తల అభివృద్ధికి అందిస్తున్న తోడ్పాటులో ప్రభుత్వ సహకారం ఖచ్చితంగా ఉంటుందన్నారు. మహిళా చేనేత కార్మికుల ఆరోగ్య పరీక్షల కోసం హెల్త్‌కార్డ్ వంటి సదుపాయాలను కల్పించాలని దానికి ప్రభుత్వ సహకారం కూడా ఉంటుందన్నారు. ప్రభుత్వం మహిళా వ్యాపారవేత్తలకు అందచేస్తున్న పలు సదుపాయాలను రాయితీలను కోవె సభ్యులకు తెలియపరిచి వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. చేనేతకు రాబోయే రోజుల్లో మరింత ప్రాముఖ్యం పెరగనుందన్నారు. కోవె సంస్థ ద్వారా భవిష్యత్తులో చేనేత క్లస్టర్ స్థాపనకు సహకరిస్తామన్నారు. ప్రస్తుతం "చేనేత రథం" అనే ఉపాధి హామీ పథకం ద్వారా నేరుగా నేతన్నల నుండి ఉత్పత్తులను వాహనాలలో నగరంలోని వీధులలో, అపార్ట్‌మెంట్‌ల వద్ద విక్రయాలను జరిపే కార్యక్రమం చేపట్టామన్నారు. దీనికి ప్రభుత్వ సహకారంతోపాటు పెట్టుబడి తక్కువ, లాభాలు ఎక్కువ ఉండటం వలన అటు నేతన్నలు ఇటు విక్రయదారులు కూడా ఈ పథకం పట్ల ఆసక్తి చూపుతున్నారని, కోవె సంస్థ ద్వారా ఈ పథకాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలని, ఆసక్తి ఉన్న వారు జౌళి మరియు చేనేత శాఖ వారిని సంప్రదించాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షురాలిగా యార్లగడ్డ గీతాశ్రీకాంత్, కార్యదర్శులుగా విజయలక్ష్మి, జయలక్ష్మి, కోశాధికారిగా యార్ల పద్మలత, ఎగ్జిక్యూటివ్ కమిటీగా శోభ రాణి, స్వాతిచంద్ర, కొడాలి కవిత, శ్రావణి జెట్టి, లక్ష్మి సుజన, అడ్వైసరీ కమిటీగా మోహినీదేవి, మాలతి, రాజమణి, శ్రీదేవిలు బాధ్యతలు స్వీకరించారు. నూతన అధ్యక్షురాలు గీతాశ్రీకాంత్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అన్ని జిల్లాలలో మహిళా వ్యాపారవేత్తలను అభివృద్ధి పరిచే దిశగా కోవే బృందసభ్యులందరు కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి ఆశయానికి అనుగుణంగా ప్రతీ ఇంటినుండి ఒక వ్యాపారవేత్త రావాలన్నారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా ఎంఎస్ఎంఇ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి. సుదర్శన్ బాబు, డిప్యూటీ జనరల్ మేనేజర్, నాబార్డ్ మురారి మోహన్ బెహరా, ఏపీ ఛాంబర్ ప్రెసిడెంట్ పోట్లూరి భాస్కరరావు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డును పునరుద్దరించాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డును పునరుద్దరించి పథకాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వి.నర్సింహారావు పిలుపునిచ్చారు. శనివారం ఏపి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటి సమావేశము సిఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో ఏపి బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి యం. హరనాధరావు, గౌరవ్యక్షులు యం. ఆది నారాయణమూర్తి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్దరించి పెండింగ్ క్లయిమ్స్ పరిష్కరిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన కూటమి నేతలు ప్రభుత్వం ఏర్పడి 10నెలలైనా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అమలుచేయడానికి పూనుకోకపోవడం కార్మికుల పట్ల ప్రభుత్వ వైఖరిని తేటతెల్లం చేస్తుందని విమర్శించారు. కార్మికవర్గాన్ని నమ్మించి మోసగించటం పాలకులకు పరిపాటిగా మారిందని అన్నారు. బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డుని పునరుద్దరించి, గతంలో శాంక్షన్ చేసి పెండింగ్ ఉన్న క్లెయిమ్‌లకు వెంటనే నిధులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోందని, భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చెయ్యాలనుకుంటున్న భవన నిర్మాణ కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కార్మికుల సంక్షేమ పథకాల అమలు కోసం ఉద్దేశించి వసూలు చేసిన సెస్ నిధులు కార్మికుల సంక్షేమానికే ఖర్చు చెయ్యాలని ప్రభుత్వానికి హితవుపలికారు. ప్రభుత్వాలు వివిధ సందర్భాల్లో అక్రమంగా తీసుకున్న వెల్ఫేర్ బోర్డ్ నిధులను తక్షణమే తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు గృహనిర్మాణాలకు వెల్ఫేర్ బోర్డ్ ద్వారా సబ్సిడీతో కూడిన రుణం ఇప్పించాలని, ఇతర రాష్ట్రాల్లో అమలుచేస్తున్న విధంగా భవన నిర్మాణ కార్మికులకు మెరుగైన సంక్షేమ పథకాలు అమలుచెయ్యాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్ అందించాలని, కార్మికుల పనికోసం వేచి ఉండే ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. నిర్మాణాల్లో ఉపయోగించే వస్తువులపై (ముడిసరుకులు) జిఎస్టిని తగ్గించాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ నెల 24వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగుతున్న ధర్నాలో జిల్లాలోని నిర్మాణ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు లక్ష్మణరావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 14న సైనిక భవన నిర్మాణానికి శంకుస్థాపన




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలోని రాగోలులో ఇంటిగ్రేటెడ్ సైనిక భవనంకు 14న శంకుస్థాపన చేయనున్నట్లు జిల్లా మాజీ సైనికుల అధ్యక్షులు పూర్ణచంద్రరావు కటకం తెలియజేశారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైనికుల అవసరాలన్నీ ఒకే చోట లభ్యమయ్యే దిశగా సైనిక భవనం పని చేస్తుందన్నారు. ఈ కాంప్లెక్స్‌లో ఇ.సి.ఎచ్.ఎస్. పోలిక్లినిక్ మరియు క్యాంటీన్ లు కూడా త్వరలో వస్తాయని వివరించారు. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌లు హాజరు కానున్నారన్నారు. గౌరవ అతిథిగా రాష్ట్ర సైనిక డైరెక్టర్ వి.వెంకటరెడ్డి, వి.ఎస్.ఎమ్.లు వస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు కూడా పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమం జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీమతి ఎ. శైలజ ఆధ్వర్యంలో జరుగుతుందని పూర్ణచంద్రరావు వివరించారు.



జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, ఆర్డీవో సాయిప్రత్యూషలను టీడీపీ పార్లమెంటరీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పీఎంజే బాబు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. - సత్యంన్యూస్, శ్రీకాకుళం.



మండలంలోని కమ్మ సిగడాం గ్రామానికి చెందిన మన్నె రమేష్ అనారోగ్యంతో బాధపడుతూ అత్యవసర చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి ఎమ్మెల్యే ఎన్ఈఆర్ ద్వారా దరఖాస్తు చేసుకోగా శనివారం ఆయనకు మంజూరైన రూ.చెక్కుపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో లంక శ్యామల రావు, బెండు మల్లేశ్వరరావు, కుమరాపు రవికుమార్, సంపత రావు నాగేశ్వరరావు, సనపల రామారావు, వెలిచేటి సురేష్, వావిలపల్లి రామకృష్ణ, డబ్బాడ ఆదినారాయణ, గోపీన కృష్ణారావు, కరాటే లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. - సత్యంన్యూస్, రణస్థలం.

## అమ్మవారి ఆలయంలో అన్నదానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



స్థానిక కుంచాల కురమయ్యపేట గల శ్రీ చక్ర రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో శనివారం అన్నదానం నిర్వహించారు. జేసీఐ మెయిన్ అధ్యక్షులు కూన అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం అనిల్ మాట్లాడుతూ పౌర్ణమి సందర్భంగా రాజరాజేశ్వరి తల్లిని దర్శించుకోవటానికి, కుంకుమ పూజకి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారన్నారు. వేసవితాపం ఎక్కువగా ఉన్నందున ఆలయానికి వచ్చే భక్తులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం కూడా చేపట్టామన్నారు. జేసీఐ డాక్టర్ జామి భీమశంకర్ మాట్లాడుతూ వేసవి తీవ్రత ఎక్కువగా ఉందని, వృద్ధులు, పిల్లలు, గర్భిణీలు తగిన జాగ్రత్తలు తీసుకుంటే వడదెబ్బలు తగిలే అవకాశం ఉండదన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ తమ్మినేని ఉషారాణి, జోన్ కో-ఆర్డినేటర్ బెండాళం వరలక్ష్మి, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, అప్పలనాయుడు, పోషక్‌కుమార్, జగదీష్, సాయి కృష్ణ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సాగునీరు కల్పించాలి


(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




రాష్ట్రంలో ఖరీఫ్ పంటలు పండించడానికి అన్నదాతలు సన్నద్ధమవుతున్నందున వారి పంట పొలాలకు సాగునీరు కల్పించే ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలని అఖిల భారత బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా కన్వీనర్, సంఘ సేవకురాలు డాక్టర్ సీపాన గుణవతి కోరారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి వార్షిక బడ్జెట్‌లో కేటాయించిన రూ. 48వేల కోట్ల వ్యయంతో రాష్ట్రంలో చెరువులు, వాగులు, జలశయాలు, సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో గల సాగునీటి వనరులను అన్నదాతలకు అందించినట్లయితే పంటల ఉత్పత్తులు గణనీయంగా ఉంటాయన్నారు. రాష్ట్రంలో ముఖ్యంగా ఉత్తరాంధ్రలో రైతులు అత్యధిక శాతం వరిపంట పైనే ఆధారపడి జీవనోపాధి సాగిస్తున్నారన్నారు. వారికి వరికి ప్రత్యామ్నాయంగా లాభసాటి పంటలపై దృష్టిమళ్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు సాగునీటితో పాటు నాణ్యమైన విత్తనాలను ఎరువులను సబ్సిడీ ధరలపై అందించే ప్రతిపాదనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టవలసి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీలపై రుణాలు ఇచ్చే ప్రతిపాదనను పరిశీలించాలని కొన్ని బ్యాంకుల అధికారులు రైతులకు రుణాలు అందజేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## అంబేద్కర్ తైలవర్ణ చిత్ర రూపకల్పన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)





రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని తైలవర్ణ చిత్రాన్ని స్థానిక రామ్మోహనరావు కాలనీకి చెందిన యువ చిత్రకారుడు కేత శ్రీను రూపొందించారు. గత పదిహేను ఏళ్ళుగా ఆయన ఎన్నో తైలవర్ణ చిత్రాలను గీసి ప్రశంసలు అందుకుంటున్నారు. ఇంతవరకు దాదాపుగా 150 చిత్రాలను గీశారు. కళింగాంధ్రలో నాటి ప్రఖ్యాత కవి అడిదం సూరకవి చిత్రం ఎక్కడా దొరక్కపోతే భక్తి సమాచారం మాసపత్రిక(విజయనగరం) సంపాదకులు సముద్రాల నాగరాజు కోరిక మేరకు ఓ ఊహా చిత్రాన్ని శ్రీను రూపొందించి కృతకృత్యుడయ్యారు. వివిధ చిత్రకళాప్రదర్శనలలో పాల్గొని తన చిత్రకళా వైభవాన్ని చాటుకున్నాడు. ముంబయిలోని ఓ విద్యాలయం నిర్వహించిన చిత్రకళ ప్రదర్శనలో సైతం పాల్గొన్నాడు. ఏకలవ్యుని తరహాలోనే గురువు లేకుండానే చిత్రకళను స్వయం కృషితో సాకారం చేసుకోవడం ఎంతయినా అభినందనీయం.నాటి రవివర్మ నుంచి నేటి మణిపాత్రుని నాగేశ్వర రావు, సుంకర చలపతి రావు, అంగ సాంబశివరావు వంటి ప్రముఖ చిత్రకారులు గీసిన చిత్రాలను పరిశీలించి ఈ కళలోని మెళకువలను అవుపోసన పెట్టాడు. గతంలో ఈ చిత్రకారుని ప్రతిభను ఆమదాలవలస శాసనసభ్యుడు కూన రవికుమార్ ప్రత్యేకంగా అభినందించారు.ఈ చిత్రకారుడు స్థానిక భాష్యం పాఠశాల బస్సు సర్వీసులో పనిచేస్తున్నాడు.

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ: వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పనిచేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను
CONTACT
9440001447, 8341163666

# అదే భూమి.. అదే రెడ్డి..
# ఈసారి తెలుగుతమ్ముడుతో..

* 2.06 ఎకరాల స్వాధీనానికి మరోసారి కుట్రలు
* ఇప్పటికే సాదాబైనామా ఆధారంగా ఎకరాకు మ్యుటేషన్
* గతంలో 'సత్యం' కథనాలతో ఈ దందా తెరమరుగు
* మళ్లీ ఇప్పుడు భూమిని చేజిక్కించుకునేందుకు యత్నాలు
* ఈసారి రంగంలోకి తెలుగు తమ్ముళ్లు
* జాయింట్ కలెక్టర్‌ను ఆశ్రయించిన బాధితులు



**భూమి గుండ్రంగా ఉందని క్రీపూ. 390లో అరిస్టాటిల్ చెబితే.. ఎంతమంది నమ్మారో తెలీదు గానీ, ఫాజుల్‌బాగ్‌పేటలో ఉన్న భూ వివాదం చూస్తే గుండ్రంగా ఉందని రుజువులు లేకుండా నమ్మొచ్చు. మాయ చేసో, మోసం చేసో సంతకవిటికి చెందిన రెడ్డి సురేష్ గతంలో తెలుగుదేశం హయాంలో ఈ భూమి మీదకు వచ్చారు. వైకాపా హయాంలో దొంగ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇప్పుడు మళ్లీ తెలుగుదేశం హయాంలో ఆ భూమిని పూర్తిగా ఆక్రమించుకోడానికి సిద్ధపడుతున్నారు. పార్టీలేవైనా చుట్టూ తిరిగి అదే భూమి దగ్గరకు రావడమే భూమ్యాకర్షణ సిద్ధాంతమో, లేదా భూమి గుండ్రంగా ఉందని చెప్పడానికి ప్రధాన రుజువులు. వివరాల్లోకి వెళితే..**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వివాదంలో ఉన్న ఫాజుల్‌బాగ్‌పేట రెవెన్యూ సర్వే నెం.120లోని 2.06 ఎకరాలకు చెందిన ఫైల్‌ను క్లియర్ చేయిస్తానని సంతకవిటి మండలం పొనుగుటి వలసకు చెందిన రెడ్డి సురేష్‌కుమార్ అనే వ్యక్తికి ఇక్కడ కొత్తగా పుట్టుకొచ్చిన తెలుగు తమ్ముడు అభయం ఇచ్చినట్టు తెలిసింది. సాగుదారులకు, భూమిపై హక్కులు కలిగివున్న హబీబుల్లాఖాన్ కుటుంబానికి మధ్య వివాదం నడుస్తున్న ఈ భూమిలో ఒక ఎకరాను రెడ్డి సురేష్‌కుమార్ 2012 జూలై 21న రాత్రికి రాత్రి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. భూమి అనుభవిస్తున్న గేదెల భాస్కరరెడ్డిని బెదిరించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు సహకారంతో ఆ ప్రక్రియ కానిచ్చేశారు. దీనిపై హక్కులు కలిగివున్న హబీబుల్లా ఖాన్ వారసుల ఫిర్యాదుతో ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సదరు సర్వే నెంబర్‌ను ఫ్రీజ్ చేసి రిజిస్ట్రేషన్ రద్దు చేశారు. అయితే సర్వే నెంబర్ 120లో 2.06 ఎకరాలకు సంబంధించి కోర్టులో ప్రీ లిటిగేషన్ కేసు నడుస్తుండగానే రెవెన్యూ అధికారులు పెద్ద మొత్తంలో డబ్బులు దండుకొని 2020 సెప్టెంబర్ 23న ఎకరా భూమికి మ్యుటేషన్ చేసేశారు. ఈ వ్యవహారంపై 'సత్యం'లో వరుస కథనాలు ప్రచురితం కావడంతో ఇన్నాళ్లు మౌనం వహించిన రెడ్డి సురేష్‌కుమార్ రెవెన్యూ అధికారులను మ్యానేజ్ చేసి రిజిస్ట్రేషన్ లేకుండానే సాదాబైనామా ఆధారంగా ఎకరా భూమిని మ్యుటేషన్ చేయించుకున్నారు. దానికి పట్టాదారు పాస్‌పుస్తకం కూడా జారీ చేసేశారు. అదే సర్వే నెంబర్‌లో మిగిలిన 1.06 ఎకరాలను కూడా సొంతం చేసుకోవడానికి ప్రయత్నించినా కుదరలేదు. గడిచిన ఎన్నికల్లో ఎమ్మెల్యే కోసం పని చేశానని, తానెంత చెబితే అంతేనంటూ చెప్పుకు తిరుగుతున్న ఒక వ్యక్తి ద్వారా రెడ్డి సురేష్ స్థానిక వీఆర్‌వో ప్రసాద్‌ను సంప్రదించి ఆ భూమిని కూడా సొంతం చేసుకోవడానికి పావులు కదుపుతున్నట్టు బాధితులు ఆరోపిస్తున్నారు.

**న్యాయస్థానంలో వివాదం**


వక్ఫ్ బోర్డుకు చెందిన ఈ 2.06 భూమిపై కె.సప్తరాజులు, భాస్కరరెడ్డి కుటుంబానికి అనుభవ హక్కులు సంక్రమించాయని చెబుతున్నా ఎస్ఎల్ఆర్‌లో మాత్రం హబీబుల్లాఖాన్ పేరు నమోదై ఉందని ఆయన వారసులు చెబుతున్నారు. వక్ఫ్ బోర్డుకు చెందిన భూమిగా చూపించి దీన్ని దక్కించుకోవడానికి నగరానికి చెందిన ముస్లిం పెద్దలు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా, అనుభవంలో ఉన్నవారికి అనుకూలంగా 2009లో తీర్పు ఇచ్చింది. వాస్తవానికి 1990లో ఈ భూమిని అనుభవిస్తున్న రైతులకు ముస్లిం పెద్దలు ఎన్ఓసీలు ఇవ్వగా, పాస్‌పుస్తకాలు కూడా పొందారు. కాగా హబీబుల్లా ఖాన్ వారసులు మొదట భాస్కరరావు అనే ఒక డాక్యుమెంట్ రైటర్ కుటుంబ సభ్యుల పేరుతో 2.06 ఎకరాలకు అగ్రిమెంట్ చేసుకున్నారు. అయితే కాలపరిమితి దాటిపోవడంతో అగ్రిమెంట్ రద్దయింది. ఆ సమయంలోనే డాక్యుమెంట్ రైటర్ భాస్కరరావు సప్తరాజులు, భాస్కరరెడ్డిల పేరుతో పాస్‌పుస్తకాలు తయారు చేయించారని బాధితులు ఆరోపించారు. ఆనాటి పాస్‌పుస్తకాల ఆధారంగానే భాస్కరరెడ్డితో బలవంతంగా సంతకాలు చేయించి రెడ్డి సురేష్ రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు ఆరోపణలున్నాయి. అయితే ఆ పాస్‌పుస్తకాలన్నీ నకిలీవని ఆరోపిస్తూ హబీబుల్లాఖాన్ వారసులు కోర్టుకు వెళ్లగా, ఇప్పటికీ ఆ కేసు నడుస్తోంది. కాగా సర్వే నెంబర్ 120లో భూ హక్కులు కలిగిన హబీబుల్లా ఖాన్ వారసులు మానవహక్కుల సంఘాన్ని ఆశ్రయించడం తదితర కారణాలతో ఇన్నాళ్లు భూ బదలాయింపు నిలిచిపోయింది.

**రెవెన్యూ అధికారులు సహకారంతో**


నగరానికి చెందిన పైడి నాగభూషణరావు అనే వ్యక్తి హబీబుల్లాఖాన్ వారసులు, అనుభవంలో ఉన్న ఇద్దరు రైతులతో 2.06 ఎకరాల భూమి విక్రయానికి అగ్రిమెంట్ చేసుకున్నారు. ఆ సమయంలో రెడ్డి సురేష్‌కుమార్ ఎంటరై నాగభూషణం కంటే ఎక్కువ మొత్తం ఇస్తానని హబీబుల్లాఖాన్ వారసులు, ఇద్దరు రైతులను నమ్మించి అగ్రిమెంట్ అమలుకాకుండా చేశారు. దీంతో అగ్రిమెంట్ చేసుకున్న నాగభూషణరావు 2019 డిసెంబర్ 19న స్థానిక టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ ఈ కేసులో రాజీ చేయాలని ప్రయత్నించి మధ్యలోనే డ్రాప్ అయ్యారు. ఇదే అదనుగా సురేష్‌కుమార్ అప్పటి వీఆర్వో, ఆర్ఐలను కలిసి వివాదాస్పద భూమితో సరిహద్దులు కలిగిన రైతులు, అనుభవదారుల స్టేట్‌మెంట్లు రికార్డు చేసినట్లు చూపించి నకిలీపత్రాలు, పాస్ పుస్తకాలతో 2020 సెప్టెంబర్‌లో ఒక అర్ధరాత్రి రెడ్డి సురేష్‌కుమార్ పేరుతో మ్యుటేషన్ చేయించారు. ఈ దందాపై 'సత్యం'లో వచ్చిన కథనాలపై అప్పటి ఆర్డీవో కిషోర్ స్పందించి భూమిని సర్వేయర్, ఆర్ఐలతో కలిసి స్వయంగా పరిశీలించారు. రెవెన్యూ రికార్డులను కూడా పరిశీలించారు. కాగా సర్వే నెం.120లో ఎకరా భూమి మ్యుటేషన్‌కు సంబంధించి తన నుంచి ఎటువంటి సర్వే రిపోర్టు తీసుకోలేదని టౌన్ సర్వేయర్ రవికుమార్ ఆర్డీవోకు వివరణ ఇచ్చారు. రెండు దశాబ్దాలుగా సర్వే నెం. 120, 124/1, 126/1,2,3లలో ఉన్న సుమారు ఎనిమిది ఎకరాలు వక్ఫ్‌బోర్డుకు చెందినవంటూ వాటిపై హక్కులు కలిగి ఉన్న ముస్లిం కుటుంబాలు కోర్టుకు వెళ్లారని కూడా సర్వేయర్ తన రిపోర్టులో పేర్కొన్నారు. దీంతో సదరు భూమికి సంబంధించిన అన్ని రికార్డులు, మ్యుటేషన్ చేయడానికి తీసుకున్న పత్రాలు, స్టేట్‌మెంట్లు తీసుకురావాలని ఆర్డీవో ఆదేశించినా రెడ్డి సురేష్ రాజకీయ కారణాలు చూపించి వాటిని సమర్పించలేదు.

**గతంలో తహసీల్దార్లు తిరస్కరించినా..**

సాదాబైనామాతోనే ఆ భూమిని మ్యుటేషన్ చేయించేందుకు ఐటీ కుమార్ తహసీల్దార్‌గా ఉన్న సమయంలోనూ సురేష్‌కుమార్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సాదాబైనామా ఆధారంగా అనుభవదారుల స్టేట్‌మెంట్లను తహసీల్దార్ రికార్డు చేశారు. అయితే ఆ స్టేట్‌మెంట్‌లో అప్పటి వీఆర్వో కొన్ని ఖాళీలు ఉంచి తర్వాత మ్యుటేషన్‌కు అనుకూలంగా దిద్దుబాటు చేశారు.



దీన్ని గుర్తించిన తహసీల్దార్ కుమార్ మ్యుటేషన్ చేయడానికి తిరస్కరించారు. అంతకు ముందు తహసీల్దార్ సుధాసాగర్ కూడా ఈ వివాదం కోర్టులో ఉందని తెలుసుకుని మ్యుటేషన్‌కు తిరస్కరించారు. వీరి తర్వాత వచ్చిన తహసీల్దార్ ప్రసాద్ మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా 2012లో వీఆర్వో ఇచ్చిన పాస్‌పుస్తకాల ఆధారంగా సాదాబైనామాను పరిగణనలోకి తీసుకొని రిజిస్ట్రేషన్ లేకుండానే మ్యుటేషన్ చేసేశారు. సాదాబైనామా ద్వారా రెవెన్యూ రికార్డుల్లో, వెబ్‌ల్యాండ్‌లో అనుభవంలో ఉన్న వ్యక్తుల పేర్లు నమోదు కావు. సంబంధిత రైతుల స్టేట్‌మెంట్ తీసుకున్న తర్వాతే సాదాబైనామాపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. దీన్ని అడ్డుపెట్టకొని రెడ్డి సురేష్ ఇటీవల హబీబుల్లా ఖాన్ వారసుల నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏడాది నుంచి ప్రయత్నించారు. హబీబుల్లా ఖాన్ వారసులతో ఒప్పంద ఖారానామా పత్రాన్ని రాయించుకున్నారు. అయితే ఒప్పందం మేరకు డబ్బులు ఇవ్వలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఒప్పందం రాసుకున్నా వేరొకరితో రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి ప్రయత్నిస్తుండడంతో హబీబుల్లాఖాన్ వారసులు జేసీకి ఫిర్యాదు చేశారు.



# ఆ అమ్మవారు కాకతీయుల ఇలవేల్పు

**- ఘనంగా పాగిరి రాజరాజేశ్వరి అమ్మవారి ఉత్సవాలు**



(సత్యంన్యూస్, రాజాం)

రాజాం మండలం పొగిరి గ్రామంలోని పొగిరి వారి కళ్లంలో వెలసి రాజరాజేశ్వరీ దేవి(బాపనమ్మ)గా పూజలందుకుంటున్న అమ్మవారు వాస్తవానికి కాకతీయుల ఇలవేల్పు కాకతి దేవి అని చరిత్ర పరిశోధకుడు, రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత గార రంగనాథం అన్నారు. రాజరాజేశ్వరీ దేవి నాలుగో వార్షికోత్సవం ముగింపు సందర్భంగా శుక్రవారం రాత్రి జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. ఓరుగల్లును పాలించిన కాకతీయులు 13వ శతాబ్దం ప్రారంభంలో వంశధార నది వరకు తమ రాజ్యాన్ని విస్తరించడం ద్వారా కనీసం పదేళ్ల పాటు ఈ ప్రాంతాన్ని పరిపాలించారని వివరించారు. కాకతీదేవిని ఆనాటి ప్రజలు చాముండేశ్వరీదేవిగా కొలిచేవారన్నారు. అదే క్రమంలో ఆ అమ్మవారిని పొగిరివారి కళ్లంలో ప్రతిష్టించి పూజలు చేసేవారని రంగనాథం తెలిపారు. ఈ సందర్భంగా రంగనాథంతో పాటు రచయిత ఉరిటి గున్నేశ్వరరావు, విశ్రాంత తెలుగు పండిట్, చిత్రకారుడు వంజరాపు సత్యం, తొలి పూజారి లాభాన కన్నంనాయుడులను ఉత్సవ కమిటీ ఘనంగా సన్మానించింది. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ పొగిరి శంకర్రావు, సర్పంచ్ ప్రతినిధి పొగిరి లెనిన్, సి.ఎ.నాయుడు, వై.వి.రమణస్వామి, సుమల మన్మధరావు, నడిపల్లి స్వామినాయుడు, పారుపల్లి కిరణ్‌కుమార్, కెల్ల వెంకటరమణ, రాజాం రచయితలు సమతం మహేశ్వరరావు, పడాల కవీశ్వరరావు, మజ్జి హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం సిక్కోలు త్రిమూర్తులతోనే సాధ్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఆధ్యాత్మికంగానే కాకుండా ప్రజావసరాలకు, అందరి అవసరార్థం అభివృద్ధి, సంక్షేమం అన్నింటిని అన్ని వర్గాల ప్రజానీకానికి అందిస్తూ అండగా నిలిచేది కూటమి నాయకులు, సిక్కోలు త్రిమూర్తులని శ్రీకాకుళం నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్ అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తే, గత వైకాపా పాలనలో అభివృద్ధి, సంక్షేమం అట్టడుగు స్థాయికి పోయిందని వెంకటేష్ విమర్శించారు. సిక్కోలు నియోజకవర్గం, నగరాభివృద్ధికి అసలైన అడ్రస్ త్రిమూర్తులు కింజరాపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ నాయకత్వమని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఎంతో ప్రాముఖ్యమైన రథసప్తమి పండుగను రాష్ట్రపండుగ ప్రకటించి అభివృద్ధి చేశారని, అలాగే కోడి రామ్మూర్తి స్టేడియం పునః నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యాయని, మరికొన్ని నెలల్లో స్టేడియం అందుబాటులోకి వస్తుందని వెంకటేష్ తెలిపారు. అలాగే ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కృషితో శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు బ్రహ్మాండంగా తయారయిందన్నారు. నగర ప్రజలకు, వ్యాపార వర్గాల ఎంతో అవసరమైన నిరంతరం ఉపయోగంలో ఉండే పురాతన పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్ అటు ప్రజానీకానికి, ఇటు కొనుగోలుదారులకు, వినియోగదారులకు, ఇబ్బంది పడేవిధంగా తయారయిందని, మార్కెట్లోకి వెళ్లడానికి కూడా దారులు గందరగోళంగా ఉన్నాయని, వాటన్నిటినీ సరిదిద్ది వ్యాపార వర్గాలకు, ప్రజానీకానికి అనుకూలంగా నూతన మార్కెట్ నిర్మాణం చేయడానికి త్రిమూర్తులు చిత్తశుద్ధితో ఉన్నారని, ఇందులో ఎవరు ఎటువంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. మున్సిపల్ కార్యాలయాన్ని ఎవరికీ అమ్మడం లేదని, ఇదంతా దుష్ప్రచారం మాత్రమేనన్నారు. చక్కని మున్సిపల్ కార్యాలయం నిర్మాణం త్రిమూర్తుల హయంలో పూర్తవుతుందని, అందరూ సహకారం అందిస్తే రాబోయే రెండు మూడేళ్లలో శ్రీకాకుళం నగరం సుందర శ్రీకాకుళం నగరంగా ఎవరు ఊహించని విధంగా అభివృద్ధి చెందుతుందని మాదారపు వెంకటేష్ అన్నారు.

**పూజించాల్సిన మహిళల పట్ల**

# అసభ్యకర వ్యాఖ్యలా?!

**- రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి**

(సత్యంన్యూస్, పాతపట్నం)



మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి భార్య భారతి రెడ్డిని కించపరుస్తూ చేబ్రోలు కిరణ్ అనే ఐటీడీపీ కార్యకర్త అనుచిత వ్యాఖ్యలు చేయడంపై వైకాపా రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళలను అగౌరపరిచే విధంగా వ్యాఖ్యలు చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరాదని అన్నారు. విపరీత కామెంట్స్‌తో తీవ్రంగా ట్రోల్ అవుతున్న కిరణ్ కుమార్ అనే టీడీపీ అభిమానిపై పార్టీ పరంగాను, చట్టపరంగాను చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక మాజీ ముఖ్యమంత్రి భార్యపైనే ఇలాంటివి జరుగుతున్నాయంటే సామాన్య మహిళల పట్ల వ్యవహరించే తీరు ఊహించలేమన్నారు. జగన్ కుటుంబంపై సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున వ్యతిరేకిస్తున్నారని, దీంతో కంగారుపడ్డ కూటమి ప్రభుత్వం అతడిని అరెస్ట్ చేశామని, చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించి కవర్ చేసుకుంటోందని విమర్శించారు. కూటమి పాలనలో అడుగడుగున మహిళల పట్ల దాడులు జరుగుతూనే ఉన్నాయని, లోకేష్ రెడ్‌బుక్ పాలన సాగుతూనే ఉందన్నారు.

# కొత్తూరు, గురండిలో రీసర్వే



(సత్యంన్యూస్, కొత్తూరు)

గతంలో రీసర్వేలో జరిగిన తప్పులు సరిదిద్దడానికి కొత్తూరు, గురండి పంచాయతీల్లో రీసర్వే నిర్వహించారు. డీటీ భీమారావు అధ్యక్షతన మొత్తం 11 టీములుగా ఫేజ్-2లో రీసర్వేను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్వేయర్లు ఎం.ఎస్.గవరయ్య, అల్లు తిరుపతి, రేవతి మిన్నారావు, హరీష్ పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాలు విడుదల

* శ్రీకాకుళం జిల్లాలో తొలి ఏడాది 63 శాతం, ద్వితీయ ఏడాది 74 శాతం ఉత్తీర్ణత
* జిల్లాలవారీగా చూస్తే వరుసగా 18, 23 స్థానాలు
* మే 12 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

రాష్ట్రవ్యాప్తంగా గత నెలలో జరిగిన ఇంటర్ పరీక్షల్లో ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసింది. మొదటి సంవత్సరంలో 70 శాతం, రెండో సంవత్సరంలో 83 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. శనివారం ఉదయం అమరావతిలో రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ఈ ఫలితాలను విడుదల చేశారు. కాగా శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి మొదటి సంవత్సరంలో 63 శాతం, ద్వితీయ సంవత్సరంలో 74 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా 4,87,295మంది విద్యార్థులు మొదటి సంవత్సరం పరీక్షలు రాయగా 3,42,979 (70 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇక ద్వితీయ సంవత్సరంలో మొత్తం 4,22,030 మంది పరీక్షలకు హాజరైతే 3,51,521 (83 శాతం) విద్యార్థులు పాస్ అయ్యారు.

**జిల్లాలో ఉత్తీర్ణత ఇలా..**

కాగా ఈ పరీక్షల్లో శ్రీకాకుళం జిల్లా మిశ్రమ ఫలితాలు సాధించింది. జిల్లాలవారీగా ఫలితాలను విశ్లేషిస్తే మొదటి సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రంలోని 26 జిల్లాల్లో శ్రీకాకుళం 18వ స్థానం, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 23వ స్థానంలో నిలిచింది. జిల్లాలో 18,574 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం పరీక్షలు రాయగా 11,733 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే 16,926 మంది ద్వితీయ సంవత్సర పరీక్షలకు హాజరుకాగా 12,532 మంది ఉత్తీర్ణులయ్యారు.

**రీకౌంటింగ్, రీవెరిఫికేషన్**

విద్యార్థులు తమకు వచ్చిన మార్కుల విషయంలో అనుమానాలను నివృత్తి చేసుకునే అవకాశాన్ని ఇంటర్మీడియట్ బోర్డు కల్పించింది. సమాధాన పత్రాల పునఃపరిశీలనకు రూ.1300 ఫీజు, మార్కుల రీకౌంటింగ్ చేయించాలనుకునేవారు ఒక్కో పేపర్‌కు రూ.260 చొప్పున ఈ నెల 13 నుంచి 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**మే 12 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ**

మార్చిలో జరిగిన పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు వచ్చే నెల 12 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. మే 12 నుంచి 20వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.